

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమీక్ష చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

# రేపు తొర్రూరుకు మంత్రి రామన్న

- 12వేల మందితో భారీగా బైక్ ర్యాలీ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, పాలకుర్తిలో 50 పడకల వైద్యశాలకు తొర్రూరులోనే శంకుస్థాపన
- మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ
- పాలకేంద్రం పక్కన సభాస్థలాన్ని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

తొర్రూరు, అక్టోబర్ 7: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, చేనేత, పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఈ నెల 9వ పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మున్సిపల్ కేంద్రానికి విచ్చేస్తున్నారు. తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన కలెక్టర్ శశాంకతో కలిసి పాలకేంద్రం పక్కన బహిరంగ సభాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేటీఆర్ సభ సక్సెస్ కోసం పార్టీ క్యాంపు కార్యాలయంలో తొర్రూరు మండల నాయకులతో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. తొర్రూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలతోపాటు ఇక్కడే కొడకండ్లలో నిర్మించనున్న మినీ టెక్స్‌టైల్ పార్కుకు, పాలకుర్తిలో రూ.17.50కోట్లతో 50 పడకల వైద్యశాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తొర్రూరులో 20వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అంతకు ముందు 12వేల మందితో తొర్రూరులో భారీ బైకుర్యాలీతో కేటీఆర్ సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు కేటీఆర్ సభకు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నా, కేవలం 20వేల మందితోనే సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛలైన ముఖ్య కార్యక్రమాలకు కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారని, ఇది ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పీ సోమేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కమిషనర్ సరస్వతి, నాయకులు దొంగరి శంకర్, కుర్ర శ్రీనివాస్, జైసింగ్‌నాయక్, బిజ్జాల అనిల్, కర్నె నాగరాజు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి గ్యారంటీలేని హామీలు

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు లేవు?
- ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటా..
- 9న తొర్రూరులో కేటీఆర్ సభకు భారీ తరలిరావాలి
- పెద్దవంగరలో 300మందితో భారీగా బైకు ర్యాలీ
- ముఖ్య నేతల సమావేశంలో మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, అక్టోబర్ 7: కాంగ్రెస్ పార్టీవి గ్యారంటీలేని హామీలని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. స్వాతంత్ర్యం అనంతరం తెలంగాణ ప్రాంతాన్ని అనేక పార్టీలు పాలించినా చేసిన అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అంధకారమేనన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి పాలనలో నిధుల కోసం గోసపడ్డామని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అడిగిన వెంటనే నిధులిస్తూ అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఒక్కో గ్రామాన్ని సుమారు కోటి రూపాయలతో కనీవిని ఎరగని రీతిలో అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే నట్టేట మునిగినట్లేనని, రాష్ట్రం నుంచి ఆ పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రైతులకు మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ కావాలో.. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. విభజించి పాలించే కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలను నియోజకవర్గంలో కాలుపెట్టనివొద్దన్నారు. మన కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ నెల 9న తొర్రూరులో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. పెద్దవంగర మండలం నుంచి 3వేల బైక్‌లతో తొర్రూరుకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీలోని ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఎర్రబెల్లి ట్రస్ట్ సహకారంతో గ్రామాల్లోని కోతులను అడవులకు తరలించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొమ్మరబోయిన పద్మ, గుగులోత్ జబ్బర్‌లాల్, మద్దెల రాజు, ఇడబోయిన వెంకన్న, నరేండ్ల సోంరెడ్డి, పనిణర రాజు బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి దయాకర్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, రైతుబంధు సమితి మండల సభ్యులు సోమనర్సింహారెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ సోమారెడ్డి, నాయకులు పీ సునీల్‌రెడ్డి, సోమేశ్వర్‌రావు, గోపాల్‌రావు, యాదగిరిరావు, సుదీర్‌కుమార్, శ్రీనివాస్, విజయ్‌పాల్‌రెడ్డి, వెంకన్న, జ్ఞానేశ్వరాచారి, సుధాకర్, లింగమూర్తి, రాము, రాజూయాదవ్, యూత్ నాయకులు హరీశ్, అనుదీప్, యాకన్న, రామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర : బీఆర్ఎస్‌లో చేరిన కాన్వాయిగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంత్రి దయాకర్‌రావు

# సంక్షేమ సారథి కేసీఆర్

- దేశం అబ్బురపడేలా తెలంగాణ అభివృద్ధి
- తెలంగాణలో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు
- ప్రజల ఆశీర్వాదం బీఆర్ఎస్ పార్టీకే..
- నెరవేరిన పాకాలపేరుపై బ్రిడ్జి నిర్మాణం కల
- మంత్రి సత్యవతిరాథోడ్
- బయ్యారం, గార్ల ఏజెన్సీలో రూ.75కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బయ్యారం: గజమాలతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్‌కు సన్మానం

బయ్యారం/ గార్ల, అక్టోబర్ 7 : తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదం బీఆర్ఎస్ పార్టీకే ఉందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం ఆమె ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, జడ్పీచైర్‌పర్సన్ బిందుతో కలిసి గార్ల మండలంలో రాంపురం పాకాల ఏటిపై రూ.15 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, బయ్యారం మండలంలోని బయ్యారం, నర్సతండా, బాలాజీపేట, వెంకట్రాంపురం, కోటగడ్డ, జగ్గుతండా, మోట్లతిమ్మాపురం, రామచంద్రాపురం గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.50 కోట్లతో రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. రాంపురం పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపనతో ఇక్కడ ప్రజల చిరకాలవాంఛ నెరవేరనున్నదని అన్నారు. తెలంగాణ సిద్ధించిన తొమ్మిదేళ్లలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దేశం అబ్బురపడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. ముఖ్యంగా రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతు బీమా, రైతుబంధు, ఉచిత కరెంటు వంటి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఏజెన్సీలోని గిరిజన రైతులకు పోడు పట్టాలిచ్చి దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు రాజ్యాధికారం కట్టబెట్టినట్లు తెలిపారు. గతంలో ఏజెన్సీ గ్రామాల్లోని రహదారుల పరిస్థితి దారుణంగా ఉండేదని, ఇప్పుడు గ్రామాల్లో ఆ పరిస్థితి లేదని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పల్లె ప్రగతితో రూపురేఖలు మారాయన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా అద్దంలా మెరిసే రహదారులు నిర్మించినట్లు తెలిపారు. బయ్యారం, గార్ల మండలాల్లోని ఆడపడుచులపై తమకు ప్రత్యేక అనుబంధం ఉందని, అందుకే ఈ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. బయ్యారం, గార్ల మండలాలతోపాటు బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొస్తామని తెలిపారు. ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైందని, త్వరలోనే మంజూరవుతుందని తెలిపారు. ఏటా రెండు పంటలకు నీరందించడం ఖాయమని తెలిపారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రజలను ఓటడిగే నైతిక హక్కు ప్రజలకు లేదన్నారు. తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఒక్కసారి అధికారం ఇవ్వాలంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ప్రజలు అవేమీ పట్టించుకోవద్దని చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన ఉక్కుఫ్యాక్టరీని కేంద్రం ఇంతవరకు నిర్మించలేదని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే హరిప్రియను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గడపగడపకూ తిరిగి సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. మతతత్వ బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాని అవసరం లేదన్నారు. బీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, అనాథ విద్యార్థులకు చేయూతనిస్తున్న బంజార సేవ సమితి వ్యవస్థాపకుడు జోగిరాంను మంత్రి అభినందించారు. అనంతరం చిన్నబంజరలో రూ.10కోట్లతో బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలను ప్రజలు నమ్మొద్దని, ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటున్న బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలను తెలంగాణ ప్రజలు నమ్మరని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియను గెలిపించుకుంటేనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రగతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ముచ్చటగా మూడోసారి ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి పట్టంకట్టాలని కోరారు. బయ్యారం మండలంలో మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్‌ను గజమాలతో సత్కరించారు. బయ్యారంలో వైస్ ఎంపీపీ తాత గణేశ్, సొసైటీ వైస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ కోటమ్మ, పద్మ, ఎంపీటీసీలు శైలజారెడ్డి, కవిత, తదితరులు పాల్గొన్నారు. గార్లలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎంపీపీ మూడు శివాజీ చౌహాన్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రాధాకృష్ణ, సర్పంచ్ అజ్మీరా బన్సీ లాల్, మండల కో ఆప్షన్ ఖాదీర్‌బాబా, మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేశ్, చిన్న బంజర సర్పంచ్ ఉష, పట్టణ అధ్యక్షుడు గాజుల గణేశ్, నాయకులు శ్రీనివాస్, మందనపు భాస్కర్‌రావు పాల్గొన్నారు.